సాక్షి
రంగారెడ్డి
బుధవారం। 9। జూలై। 2025



తారు.. బేజారు

యాచారం-కందుకూరు మండలాల సరిహద్దు వంద అడుగుల రోడ్డు విస్తరణకు గ్రహణం పట్టింది. 8లో▸



ఒడిశా టు హైదరాబాద్

హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. 8లో▸



నిబంధనలు పాటించని..

వచ్చీరాని వైద్యంతో చెలగాటమాడుతున్న ఆర్‌ఎంపీలపై చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸

రేపు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశంతో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





అంశం: మున్సిపల్ పరిధిలో సమస్యలు
మున్సిపాలిటీ : చేవెళ్ల
కమిషనర్: ఎస్.వెంకటేశం
తేదీ: 10-7-2025 (గురువారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 13243, 98665 07624

న్యూస్‌రీల్

రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలని వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బాలాపూర్‌లో అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యాలు ఏళ్ల తరబడి తిష్టవేశారని అన్నారు. తనపై రెక్కీ సైతం నిర్వహించారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకునేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రగతి పథంలో మహిళా సంఘాలు



మాట్లాడుతున్న ఏపీఎం శోభారాణి

చేవెళ్ల: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళా సంఘాలు ఎంతో ప్రగతి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని సెర్ప్ జిల్లా అధికారి నర్సింహ, ఏపీఎం శోభారాణి అన్నారు. మండలకేంద్రంలోని మహిళా శక్తి భవనంలో మంగళవారం మహిళా శక్తి సంబరాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం విద్యార్థుల యూనిఫామ్ కుట్టు కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్మన్‌లుగా ఏర్పాటు, పౌల్ట్రీ, డెయిరీ, పాడి పరిశ్రమ, ఎంటర్‌ప్రైజెస్, సోలార్‌యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, గోదాంలు, పెట్రోల్‌బంక్‌లు తదితర వాటిని కేటాయిస్తోందని తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకునేందుకు మహిళలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు భారతి, మండల సీసీలు, సమాఖ్య సభ్యులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం


చార్మినార్: ఆషాఢమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నారు. సప్త మాతృకలకు సప్త బంగారు బోనంలో భాగంగా ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి.. మూడో బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి, నాలుగో బోనాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించారు. అయిదో బంగారు బోనాన్ని సికింద్రాబాద్ ఉజ్జయినీ అమ్మవారికి సమర్పించనున్నట్లు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు.

వడివడిగా కొహెడ!

దేశంలోనే అతి పెద్ద మార్కెట్
- ఇంటిగ్రేటెడ్ నిర్మాణానికి అడుగులు
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు
- డీపీఆర్ సిద్ధం చేసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ
- త్వరలో సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభం



మార్కెట్ కార్యాలయం మోడల్



మార్కెట్‌లో నిర్మించబోయే టవర్ ఆఫ్ ఎక్సలెన్సీ మోడల్

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కొహెడలో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. నగరంలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను ఇక్కడికి తరలించాలనే ఉద్దేశంతో మార్కెటింగ్ శాఖ ప్రయత్నాలు మొదలు పెట్టింది. అంతర్జాతీయ స్థాయిలో క్రయవిక్రయాలు చేపట్టడమే లక్ష్యంగా మార్కెట్‌ను నిర్మించనున్నారు. సుమారు రెండు వందల ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డీపీఆర్ (డీటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) సిద్ధం చేసింది. భవిష్యత్తులో పెరగనున్న ఉద్యాన పంటల దిగుబడిని దృష్టిలో ఉంచుకుని ఎగుమతులు, దిగుమతులకు వీలుగా ఈ మార్కెట్ నిర్మాణం జరగనుంది.

199 ఎకరాల్లో నిర్మాణం

కొహెడ సర్వేనంబర్ 507, 508లో ఇప్పటికే సేకరించిన 199 ఎకరాల్లో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందులో మౌలిక వసతుల కోసం 48, రోడ్లకు 56, టోల్‌గేటు, నాలా, గ్రామ రోడ్డుకు 18, పార్కింగ్‌కు 17, శీతల గిడ్డంగులకు 10 ఎకరాలు కేటాయిస్తారు. సామగ్రి నిల్వ, ప్రాథమిక శుద్ధి, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పరిశీలన భవనం, ప్రయోగశాలలు, విశ్రాంతి గృహాలు, అగ్నిమాపక కేంద్రం, పోలీస్‌స్టేషన్, ఆరోగ్య కేంద్రం, ఘనవ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు భూమిని కేటాయిస్తారు.

టవర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మాణం

వంద అడుగుల ఎత్తులో 19,375 చదరపు అడుగుల్లో ఇక్కడ టవర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో నాలుగు అంతస్తులు వ్యాపార సంస్థలకు కేటాయిస్తామని, అందులో హైస్పీడ్ ప్యాసింజర్ లిఫ్టులు, హెలీ ప్యాడ్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ ఎగుమతి, దిగుమతి సంస్థల కార్యాలయాలకు స్థలాన్ని లీజుకు కేటాయించనున్నట్లు చెప్పారు.

వివిధ రకాల మార్కెట్లు ఇక్కడికే..

పండ్లతో పాటు పూలు, చేపలు, మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్, పాడి ఉత్పత్తుల క్రయవిక్రయాలు సైతం జరిపేందుకు ఇక్కడ సదుపాయాలు కల్పించనున్నారు. ఆయా ఉత్పత్తులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించనున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం



కొహెడలో అత్యాధునిక మార్కెట్ నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దేశంలోని పలు మార్కెట్లపై అధ్యయనం చేసిన అధికారులు రూ.2,904 కోట్ల అంచనాతో డీపీఆర్ సిద్ధం చేశారు. ఇప్పటికే సేకరించిన రూ.314 కోట్లు మార్కెటింగ్ శాఖ అకౌంట్‌లో ఉన్నాయి. నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించాం. మార్కెట్ నిర్మాణానికి సీఎం సానుకూలంగా ఉన్నారు. త్వరలోనే ఆయన చేతుల మీదుగా పనులు ప్రారంభమవుతాయి.

– చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, గడ్డిన్నారం

పరిహారం కోసం పట్టు

- రాత్రి, పగలు అక్కడే భోజనం, నిద్ర
- భీష్మించుకు కూర్చున్న ఎనికేపల్లి రైతులు



భూముల వద్ద బైఠాయించిన మహిళా రైతులు

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులు పరిహారం కోసం పట్టుబట్టి కూర్చున్నారు. రాత్రి, పగలు అక్కడే తింటూ, అక్కడే ఉంటున్నారు. గోశాల పనులకు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య భూమిపూజ చేయడం తెలిసిందే. దీనిపై నిరసన వ్యక్తం చేసిన రైతులు రాత్రంతా అక్కడే భోజనాలు చేసి మంటలు పెట్టుకుని కాపలా కాస్తూ అక్కడే నిద్రపోయారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడి నుంచి కదలలేదు. పరిహారం తేల్చే వరకు పనులు జరగనివ్వమని భీష్మించుకు కూర్చున్నారు. మరోవైపు పోలీస్ పహారా కొనసాగుతోంది. స్థానిక పోలీసులతోపాటు స్పెషల్ బెటాలియన్ పోలీసులు గస్తీ కాస్తున్నారు. కాగా, భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు 300 గజాల చొప్పున పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై చర్చించేందుకు రావాలని రైతులను పిలిచినా వారి నుంచి స్పందన రావడంలేదని తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలపై కొరడా



ఎనికేపల్లిలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 180లో రెండు చోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. రోడ్డు పక్కనే ఓ పౌల్ట్రీఫాంలో కొంత ప్రభుత్వ భూమిని కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారు. మరోచోట వెంచర్‌లో కొంత ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్రహరీ నిర్మించారు. గోశాలకోసం ప్రతిపాదించిన సర్వేనంబర్ 180లోని 99.14 ఎకారల భూమిని ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే చేయడంతో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తేలింది. దీంతో మంగళవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్‌ఐ రాజేష్, సర్వేయర్ జలజ, రెవెన్యూ సిబ్బంది జేసీబీలతో అక్కడికి చేరుకున్నారు. పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. హద్దులు ఏర్పాటు చేసి బోర్డులు పాతారు. అనంతరం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికొస్తే ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని అన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ అధికారులు రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం వివరాలు అందిస్తున్న లబ్ధిదారులు

రెండోరోజు ప్లాట్ల కేటాయింపు

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన టీజీఐఐసీ లేఅవుట్‌లోని ఏటీసీ సెంటర్‌లో మంగళవారం రెండో రోజు లాటరీ ద్వారా ప్లాట్ల పంపిణీ కొనసాగింది. కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి లాటరీ ద్వారా లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. 121 గజాలు సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు పంపిణీ నిర్వహించారు. మొత్తం 1,051 మంది ఉండగా 718 మంది డ్రాలో పాల్గొన్నారని, 333 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా బుధవారం 181 గజాల లబ్ధిదారులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల వరకు లబ్ధిదారులు లేఅవుట్‌లోకి చేరుకోవాలని సూచించారు.

జన నేతకు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద అభిమానులు, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పరితపించిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

వైభవంగా శోభాయాత్ర

కందుకూరు: గురు పూర్ణిమ మహోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పాదయాత్ర, సైకిల్ యాత్రగా తరలివచ్చిన సాధకులతో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం నుంచి పులిమామిడిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం వరకు చేపట్టిన రథయాత్ర, పల్లకీ సేవ శోభాయమానంగా కొనసాగింది. రథంపై పరమ పూజ్య సద్గురు స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహాన్ని కొలువుదీర్చిన గురూజీ శోభాయాత్రను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు, నృత్యాల నడుమ సాధకులు పెద్ద ఎత్తున పాల్గొని పల్లకీ సేవ, రథంతో పాటు నిఖిల్ చేతనా కేంద్రం వరకు పాదయాత్ర చేపట్టారు. కందుకూరు చౌరస్తా నుంచి ప్రారంభించి కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి గ్రామాల మీదుగా యాత్ర కొనసాగగా భక్తులు నీరాజనాలు పలికారు. ఆశ్రమానికి చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గురూజీ ప్రవచనాలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించారు. బుధ, గురువారాల్లో శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



కొనసాగుతున్న శోభాయాత్ర



శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఎంపీటీసీ స్థానాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్

చేవెళ్ల: మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మంగళవారం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు అభ్యంతరాలుంటే 9వ తేదీన తెలియజేయాలని సూచించారు. 10, 11 తేదీల్లో వీటిని పరిశీలించి, 12న తుది జాబితా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మండలంలో గతంలో ఉన్న 17 ఎంపీటీసీ స్థానాలకు గాను చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పాటుతో 12 గ్రామాలు ఇందులో విలీనం అయ్యాయని, ఫలితంగా ఎంపీటీసీ స్థానాల సంఖ్య 10కి తగ్గిందని వివరించారు. నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల జనాభా, ఓటర్ల ఆధారంగా 10 ఎంపీటీసీ స్థానాలుగా నిర్ణయించినట్టు వెల్లడించారు. తంగడపల్లి, అంతారం (కౌకుంట్ల, అంతారం, హస్తేపూర్), న్యాలట (న్యాలట, సింగప్పగూడ, తల్లారం), ఎన్కేపల్లి (ఎన్కేపల్లి, ఈర్లపల్లి, కమ్మెట, గొల్లగూడ), ముడిమ్యాల (ముడిమ్యాల, రావులపల్లి, కుమ్మెర, గొల్లపల్లి), ఆలూరు- 1, ఆలూరు- 2, చనువెళ్లి (చనువెళ్లి, బస్తేపూర్, మిర్జాగూడ), ఖానాపూర్ (ఖానాపూర్, నాంచేరు, రేగడిఘనాపూర్, దేవరంపల్లి), గుండాల (గుండాల, అల్లవాడ) నిర్ణయించినట్లు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

బంజారాహిల్స్: ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారాహిల్స్ కొమురం భీం భవన్‌లో మంగళవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం శిబిరంలో అధునాతన యంత్రాలు, సిబ్బందికి ఇచ్చే మందులు తదితరాలను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత పరికరాల కిట్స్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరాన్ని జీహెచ్‌ఎంసీ వర్కర్లు పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న ప్రతి శానిటేషన్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తూ నెలవారీ మందులు ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



మొక్కలు నాటేందుకు తీసిన గోతులను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్డీ)లో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాల అధికారులు మంగళవారం మండలంలోని నెర్రపల్లి, దండుమైలారం గ్రామాలను సందర్శించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు అభినేంద్రకుమార్, స్వాగత్ దాస్, ఎస్‌ఐసీ అధికారి అమిత్‌కుమార్, ఎన్‌ఐఆర్డీ అధికారులు ప్రసాద్, మోహిత్, వెస్లీ టీం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పోగ్రాం అధికారులు మురళి, సందీప్, అబేద్‌ఖాన్, రాజశేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ చరణ్ గౌతమ్‌లతో కూడిన బృందం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ అధికారులు శ్వేత, సంధ్య, పరుశురాం, ఎంపీడీవో యెల్లంకి జంగయ్యగౌడ్, ఎంపీఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు వీణా, శివకుమార్, ఏపీఓ తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్‌సిటీతో మహర్దశ



నందివనపర్తిలో పంచాయతీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఫ్యూచర్‌సిటీతో యాచారానికి మహర్దశ పట్టనుందని, కాంగ్రెస్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విశ్వనగరం వైపే ప్రపంచ చూపు ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం, యాచారం గ్రామాల్లో మంగళవారం ఆయన రూ. రెండున్నర కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీ నిర్మించి ఈ ప్రాంతాన్ని సర్వనాశనం చేయాలని చూస్తే, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యూచర్‌సిటీ నిర్మించి ప్రపంచస్థాయి గుర్తింపు పొందేలా కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అందులో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, యాచారం మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రాంరెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి దింపివేత..
అంబులెన్స్ వచ్చేలోపు మృత్యువాత


అనసూయమ్మ మృతదేహం

కేశంపేట: చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తున్న వృద్ధురాలితో పాటు ఆమె కుటుంబ సభ్యులను ఆర్టీసీ సిబ్బంది బస్సులో నుంచి దింపేశారు. ఆత ర్వాత కొద్ది నిమిషాలకే బాధితురాలు మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేశంపేటకు చెందిన నారని అనసూయమ్మ (64)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. భర్త రాములు మూడేళ్ల క్రితం, పెద్ద కూతురు ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందారు. ప్రస్తుతం అనసూయమ్మ కేశంపేటలోనే కుమారుడి వద్ద ఉంటోంది. ఇటీవల ఆరోగ్యం బాగో లేక పోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పదిహేను రోజులుగా దగ్గు, దమ్ము అధికం కావడంతో మూడుసార్లు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరోసారి హైదరాబాద్ వెళ్లేందుకు అనసూయను తీసుకుని ఆమె కొడుకు, కోడలు మంగళవారం కేశంపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు కొత్తూర్ వద్దకు రాగానే అనసూయనకు దమ్ము ఎక్కువైందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇది గమనించిన ఆర్టీసీ సిబ్బంది ముగ్గురినీ కిందకు దింపేశారు. బాధితులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ వచ్చే సరికే అనసూయ మృతిచెందారు.

నిబంధనలు పాటించని క్లినిక్‌ల సీజ్

- కఠిన చర్యలు తప్పవు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రబాబు


ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రబాబు, వైద్య సిబ్బంది

షాబాద్: వచ్చిరాని వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లను సీజ్ చేశారు. అర్హత లేకున్న నిర్వహిస్తున్న ఆర్ఎంపీలపై చర్యలు తప్పవని మండిపడ్డారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షాబాద్‌లో నిర్వహిస్తున్న క్లినిక్‌లపై తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని తనిఖీ చేసేందుకు వెళ్లగా, అప్పటికే వారు మూసివేసి వెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం క్లినిక్‌లను సీజ్ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించండి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్


ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ పాండుకు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల్లో వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. సర్కారు బడులను బలోపేతం చేయకుండా విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, సాయి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో ఆపరేషన్ ముస్కాన్

మాడ్గుల: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బందీలుగా ఉన్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మాడ్గుల మండలంలో సీఐ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం మండలంలో బాల కార్మికుల స్థావరాలుగా నిలిచే పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, గోదాములు, హోటళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నల్లచెరువు శివారులో ఉన్న పౌల్ట్రీ ఫారంలో పని చేస్తున్న ఇద్దరు బాలికలను గుర్తించారు. యాజమాన్యంపై విచారణ జరుగుతున్నట్లు సీఐ తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య

తుర్కయంజాల్: కార్మిక చట్టాల రద్దుతో యాజమాన్యాలకు లాభాలు పెరిగి, కార్మికులు బానిసలుగా మారనున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో సుమారు 20 కోట్ల మంది కార్మికులు పాల్గొనే అవకాశం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి 8 గంటల పనిదినం, రూ.26 కనీస వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఇబ్రహీంపట్నం: ఇంటి గేటు పెడుతుండగా మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కొని పరారైన సంఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కప్పపహాడ్ గ్రామానికి చెందిన బూడిద పద్మమ్మ(58) ఆరుబయట నిలబడి తిరిగి ఇంట్లోకి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నారు.

తారు.. బేజారు


యాచారంలోని నస్దిక్‌సింగారం గ్రామ సమీపంలో వంద అడుగుల మట్టి రోడ్డు


కందుకూరులోని మీరాఖాన్‌పేట సమీపంలో పూల మొక్కలతో రోడ్డు

ఐదేళ్లయినా గ్రహణం వీడని ఫార్మాసిటీ రోడ్డు

- కందుకూరులో కళకళ
- యాచారంలో వెలవెల
- అవస్థలు పడుతున్న వాహనదారులు

యాచారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో యాచారం, కందుకూరు మండలాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని భావించిన స్థానికులకు నిరాశ తప్పడం లేదు. రహదారులు నిర్మించక పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీకి భూసేకరణలో భాగంగా యాచారం-కందుకూర్ మండలాల మధ్యలో ఉన్న చిన్న రోడ్డును విస్తరించాలని సంకల్పించారు. ఈ రహదారిని వంద అడుగులకు విస్తరిస్తే ఫార్మాసిటీకి మార్గం సులువుతుందని అభిప్రాయం. అప్పట్లో 25 కిలోమీటర్ల రోడ్డుకు రూ.వంద కోట్లకు పైగా నిధులను టీజీఐఐసీ నుంచి మంజూరు చేశారు. కందుకూరు నుంచి మీరాఖాన్‌పేట గ్రామం సరిహద్దు వరకు రోడ్డు విస్తరణ అయింది. కానీ మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, నందివనపర్తి, మొగుళ్లవంపు నుంచి యాచారానికి రహదారి పనులు ముందుకు కదలడం లేదు.

దుమ్ము, ధూళితో నరకం

మీరాఖాన్‌పేట గ్రామం సరిహద్దు నుంచి నస్దిక్‌సింగారం వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ కోసం గత నాలుగేళ్ల కింద పనులు ప్రారంభించారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి, రోడ్డుపై మట్టి పోశారు. కానీ పనుల్లో కదలిక లోపించింది. యాచారం-కందుకూర్ మండలాల సరిహద్దు కలిపే ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఫ్యూచర్‌సిటీ నిర్మాణం, భూసేకరణ ప్రక్రియలో భాగంగా తరచూ రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ ఉన్నతాధికారులు ఈ రోడ్డు నుంచే నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల్లో పర్యటిస్తారు. రోడ్డుపై పోసిన మట్టి ఎండలకు దుమ్ము లేస్తుంది. బైక్‌లపై వెళ్లే ప్రయాణికులకు కళ్లు, నోట్లోకి పోయి శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. రోడ్డు విస్తరణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కందుకూరు మండలంలో చకచక రహదారి పనులు జరిగితే ఇక్కడ మాత్రం నత్తతో పోటీ పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం విషయంలో పెంచాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోలేదు

గత సర్కార్‌లో అధికారుల నిర్లక్ష్యంతో యాచారం-కందుకూర్ మండలాల సరిహద్దు వంద అడుగుల రోడ్డు విస్తరణకు గ్రహణం పట్టింది. నందివనపర్తిలో తన కుటుంబానికి చెందిన రెండు ఎకరాల వ్యవసాయ పొలం పోతుంది. ఎకరాకు రూ.50 లక్షలకు పైగా పరిహారం ఇస్తే భూమి ఇస్తామని కోరాం. కానీ అధికారులు పట్టించుకోలేదు.

– మల్లారెడ్డి, రైతు, నందివనపర్తి

కేసులు పెట్టారు

యాచారం-కందుకూర్ మండలాల సరిహద్దులోని వంద అడుగుల రోడ్డు విస్తరణలో కోల్పోయే భూమికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరాం. కానీ అప్పటి సర్కార్‌లోని ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడనీయకుండా అడ్డుకున్నారు. కేసులు పెట్టి జైలుకు పంపారు. కేసులు తీసేయాలి. రోడ్డు విస్తరణకు అభ్యంతరం లేదు.

– రామనాథం, రైతు, నందివనపర్తి

ఉన్నతాధికారులకు నివేదిస్తా

రెండు మండలాల సరిహద్దులోని వంద అడుగుల రోడ్డు విస్తరణకు కావాల్సిన భూసేకరణపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. ఫార్మాసిటీ గ్రామాల పర్యటనలో నిత్యం ఈ రోడ్డుపై నుంచి వెళ్తున్నాం. దుమ్ము, ధూళి వస్తుంది వాస్తవమే. రోడ్డు విస్తరణ జరిగితేనే ప్రజలకు సులభ ప్రయాణం ఉంటుంది. టీజీఐఐసీ అధికారులతో మాట్లాడుతా.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

ప్లాట్ కబ్జా చేసిన వారిపై ఫిర్యాదు

బంజారాహిల్స్: బోగస్ డాక్యుమెంట్లతో తన ప్లాట్‌ను కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు చాడ రమేష్‌చందర్‌రెడ్డి మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ వినాయకహిల్స్ సర్వేనంబర్ 94 నుంచి 97తో పాటు 103లో తనకు 300 గజాల ప్లాట్ ఉందని, ఈ ప్లాట్‌ను ఇద్దరు వ్యక్తులు ఫేక్ డాక్యుమెంట్లతో కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి ఆధారాలతో తాను మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. సంబంధిత ఎస్ఐ కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోగా, సివిల్ తగాదా అంటూ కేసును మూసివేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ప్రజావాణి అధికారులు ఫిర్యాదును స్వీకరించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


ఆర్టీసీ డిపో ఎదుట సమ్మె కరపత్రాలను చూపుతున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం: దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలో బైక్ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేశ్, స్వప్న, వీరేశం, దుర్గయ్య, వెంకటయ్య, ఆర్టీసీ డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు నర్సింహ, జంగయ్య, దిలీప్ పాల్గొన్నారు.

అధికారులపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు


ఫిర్యాదు కాపీతో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ

నందిగామ: ప్రభుత్వం తనకిచ్చిన స్థలంలో వేసుకున్న గుడిసెను తొలగించడంతో పాటు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారికి వత్తాసు పలుకుతున్న పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని మోత్కులగూడ మాజీ సర్పంచ్ వానరాసి ఎల్లమ్మ మంగళవారం మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన కాపీని విలేకరులకు అందజేశారు. తాము ఇంటి వద్ద లేని సమయంలో గ్రామానికి చెందిన జెట్ట శంకరయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులు తన ప్లాటులోకి ప్రవేశించి, ఇంటి నిర్మాణం కోసం ముగ్గుపోశారని తెలిపారు. విషయం తెలియడంతో తాను అక్కడికి వెళ్లగా స్థానికుల సమక్షంలోనే దూషించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని వివరించారు. అనంతరం గ్రామ కార్యదర్శి చెన్నయ్య, ఎంపీడీఓ సుమతి కబ్జాదారులతో కుమ్మక్కై ఎలాంటి విచారణ చేపట్టకుండా, కనీసం పట్టా సర్టిఫికెట్లు కూడా పరిశీలించకుండానే తనను ప్లాటులోకి వెళ్లనీయలేదన్నారు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి గత నెల 27న పది మంది పోలీసులతో వచ్చి తన ప్లాటులో ఉన్న గుడిసెను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్లాటుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయని, ముప్పై ఏళ్లుగా కబ్జాలో ఉన్నానని చెప్పినా కూడా వినిపించుకోలేని పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

కల్లు కాంపౌండ్‌లో బాలిక కిడ్నాప్


కిడ్నాప్‌నకు గురైన కీర్తన

శంషాబాద్: కల్లుకాంపౌండ్ వద్ద ఓ చిన్నారిని మచ్చిక చేసుకున్న గుర్తు తెలియని మహిళ బాలికను కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్‌జీఐ ఎస్ఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, కంచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ తన కుమార్తెలు కీర్తన (6) అర్చన్ (3)తో పాటు తమ మావతో కలిసి ఈ నెల 1న శంషాబాద్ కల్లు కంపౌండ్‌కు వచ్చింది. కల్లు తాగుతున్న క్రమంలో ఎదురుగా కూర్చున్న గుర్తు తెలియని మహిళ లక్ష్మమ్మ కుమార్తె కీర్తనను దగ్గరకు తీసుకుని మాటలు కలపడంతో పాటు కల్లు తాగించింది. అనంతరం కంపౌండ్ బయట తినడానికి ఏమైనా ఇప్పిస్తానని తల్లికి చెప్పి చిన్నారిని తీసుకుని బయటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో లక్ష్మమ్మ పరిసర ప్రాంతాల్లో గాలించింది. గ్రామానికి వెళ్లిపోయిన అనంతరం వారి కుటుంబసభ్యుల సూచన మేరకు మంగళవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా మధ్యవయస్సురాలైన ఓ మహిళ కీర్తనను వెంటబెట్టుకుని వెళ్లినట్లు గుర్తించారు. మూడు బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి

జగద్గిరిగుట్ట: డెలివరీ బాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవమ్మ బస్తీకి చెందిన శ్రీకాంత్ జియో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి పనులు ముగించుకు ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వైపు వెళుతుండగా పాపిరెడ్డి నగర్ ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు అతడి బైకును అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వాగ్వాదం జరగడంతో వారు దీంతో శ్రీకాంత్‌పై ముక్కుమ్మడిగా దాడి చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన శ్రీకాంత్‌ను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సెక్యూరిటీ గార్డు దారుణ హత్య


దాసరి రాజు


గచ్చిబౌలి: నిర్మాణంలో ఉన్న భవనంలో సెక్యూరిటీ గార్డు దారుణ హత్యకు గురైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మయూరి బిల్డింగ్స్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వే నెంబర్ 90/1లో ఓఆర్ఆర్ సర్కిల్‌లో నిర్మాణంలో ఉన్న మయూరి బిల్డింగ్‌లో మైక్రాన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బేస్‌మెంట్ 3లో ఎలక్ట్రికల్ సామగ్రి స్టోర్ రూమ్ ఏర్పాటు చేశారు. జగద్గిరిగుట్టకు చెందిన దాసరి రాజు(59) అక్కడ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి వచ్చిన అతను మంగళవారం ఉదయం రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించిన స్టోర్ ఇన్‌చార్జి అనిల్ డయల్ 100కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఇనుప రాడ్డుతో రాజు తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి లోపలికి వె వెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో వెళ్లిన అనుమానితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా టు హైదరాబాద్

- గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు
- 38 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులకు రిమాండ్


మోకిల పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి: హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను మంగళవారం మోకిల పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్ తరలించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ మోకిల పీఎస్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన స్నేహితులు దాశరథి ప్రధాన్(26), సిబానాహక్(21), నీలుమండల్(21), సాగర్‌సాస్మల్(25) సులభంగా డబ్బు సంపాదించి, జల్సాలకు అలవాటు పడ్డారు. ఇందులో భాగంగా తక్కువ ధరకు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి, నగరంలోని కార్మిక ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈక్రమంలో ఒడిశాలోని ప్రదీప్ అనే వ్యక్తి వద్ద రూ.16 వేలకు 38 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దీన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో కొల్లూర్ గేట్ సమీపంలోని బృందావనం గార్డెన్స్ వద్ద దాడి చేశారు. వీరి నుంచి 38కిలోల గంజాయి, 5ఫోన్లు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన మోకిల సీఐ వీరబాబు, ఎస్ఓటీ సీఐ అంజయ్య, ఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.


ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతులకు పట్టాలివ్వండి

మంచాల: రాచకొండ రెవెన్యూ పరిధిలో తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాదగోని జంగయ్యగౌడ్, మేఘావత్ లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంస్థాన్ నారాయణపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాచకొండ రెవెన్యూ పరిధిలోని 273 సర్వే నంబర్‌లోని వందలాది ఎకరాల భూములను మంచాల మండలం పటేల్‌చెరువు తండాకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ధరణి చట్టాన్ని తీసుకురావడంతో వీరికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వలేదన్నారు. గతంలోని పాత పట్టా పాసు పుస్తకాలతో బ్యాంకు రుణాలు కూడా పొందారని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీరికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు, రైతులు రవినాయక్, జాలనాయక్, నరేందర్‌నాయక్, మోతీరాంనాయక్, శ్రీధర్‌నాయక్ పాల్గొన్నారు.

థ్యాంక్యూ..సీఎం సార్..

పారదర్శకంగా పదోన్నతులు, పోస్టింగ్‌లపై హర్షం

సాక్షి, సిటీబ్యూరో: త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని, పారదర్శకంగా పోస్టింగ్‌లు ఇవ్వడం పట్ల వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.కిరణ్ బొల్లేపాక, కార్యదర్శి మాదాల కిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దంగా ఎన్నడూ పోస్టింగ్‌లు, పదోన్నతులు ఇంత పారదర్శకంగా జరిగినట్లు చూడలేదన్నారు. ప్రొఫెసర్ల పదోన్నతులను పరిగణలోకి తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమస్యలకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు.